సాక్షి కామారెడ్డి

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025





### మున్సిపాలిటీ పేరు చెప్పి..

బిచ్కుందతోపాటు సమీపంలోని గ్రామాలలో మున్సిపాలిటీ పేరు చెప్పి పంచాయతీ అధికారులు పన్నులు వసూలు చేస్తున్నారు.

- 8లో ▸



### మోసాలను ఎండగట్టాలి

కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
43.5 /22.2

### వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ఉమ్మడి జిల్లాకు చెందిన మావోయిస్టు నేత అరెస్ట్!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఉమ్మడి జిల్లాకు చెందిన మావోయిస్టు నేత మూడెడ్ల సాయిలు అలియాస్ రఘు అరెస్టయ్యారు. ఈనెల 19న భామ్రాఘర్ తాలూకా పరిధిలోని పల్లి అటవీ ప్రాంతంలో సాయిలుతో పాటు ఆయన భార్య జైని ఖరతం అలియాస్ అఖిల, మరో ఇద్దరు కూడా అరెస్టయ్యారని తెలుస్తోంది. వారిపై మహారాష్ట్రలో రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు సమాచారం. కాగా 1990 ప్రాంతంలో అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్ ఉద్యమంలో చేరిన సాయిలు సిర్నాపల్లి దళంలో పనిచేసి కొంతకాలానికే గడ్చిరోలికి వెళ్లాడని తెలుస్తోంది. ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి తిరిగి రాలేదని సమాచారం. గడ్చిరోలిలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పనిచేశారని, ప్రస్తుతం సౌత్ గడ్చిరోలి డివిజన్ సెక్రెటరీగా పనిచేస్తున్నాడని సమాచారం. సాయిలు సొంతూరు నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం లింగాపూర్ గ్రామం. ఉమ్మడి జిల్లా నుంచి కామారెడ్డి మండలం ఇస్రోజీవాడికి చెందిన స్వామి అలియాస్ లోకోటి చందర్, ఆయన కొడుకు రమేశ్, కూతురు లావణ్య, పాల్వంచ మండలం ఆరెపల్లికి చెందిన ఎర్రగొల్ల రవితో పాటు మరో ఇద్దరు ముగ్గురు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం.

### మల్బరి సాగుపై అవగాహన కల్పించాలి



భిక్కనూరు: మల్బరి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని పట్టు పరిశ్రమ శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ లత సూచించారు. ఆదివారం జంగంపల్లి శివారులో ఉన్న మల్బరి తోటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్బరి సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. పట్టు పరిశ్రమ శాఖకు గ్రామంలో 75 ఎకరాల స్థలం ఉందన్నారు. ఇది అక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, స్థలం చుట్టూ ఫెన్సింగ్ చేయించాలని ఆదేశించారు. భూములు ఆక్రమణకు గురయితే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట పట్టు పరిశ్రమ జిల్లా అధికారి ఐలయ్య, సాంకేతిక అధికారి నాగేంద్రయ్య ఉన్నారు.

### నేడు మామిడికాత వేలం

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలోని మామిడితోట కాతను సోమవారం వేలం వేయనున్నట్లు ఉద్యాన క్షేత్ర అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. క్షేత్రంలోని మామిడితోట కాతకు శనివారం నిర్వహించిన వేలంపాటలో నిర్ణీత ధర పలకకపోవడంతో వేలం వాయిదా వేశామని పేర్కొన్నారు. దీంతో సోమవారం మరోమారు వేలంపాట నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఆసక్తి గలవారు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఉద్యాన క్షేత్రంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

### గంటసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాకేంద్రంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో కామారెడ్డి పట్టణంతో పాటు 25 సబ్ స్టేషన్ల పరిధిలోని దాదాపు వంద గ్రామాల్లో గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది శ్రమించి సమస్యను పరిష్కరించారు. ప్రస్తుతం ఎండలు ముదరడంతో రాత్రి వేళ ఉక్కపోతగా ఉంటోంది. ఈ సమయంలో సుమారు గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.

### 'ఓపెన్' పరీక్షలు ప్రారంభం

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఓపెన్ పరీక్షలకు పదో తరగతిలో 562 మంది విద్యార్థులు, ఇంటర్‌లో 985 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఆదివారం మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు 140 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలకు 57 మంది, ఇంటర్ పరీక్షలకు 83 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు.

### ఆరుగురిపై మైనర్ డ్రైవింగ్ కేసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ ఆరుగురు మైనర్లపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. హెల్మెట్లు ధరించని 371 మంది వాహనదారులతోపాటు రాంగ్‌రూట్‌లో వాహనం నడుపుతున్న 36 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

# గీత దాటితే వాత!

- విధుల్లో నిర్లక్ష్యంపై పోలీస్ బాస్ కొరడా
- మూడు వారాల్లో నలుగురిపై సస్పెన్షన్ వేటు
- బాధ్యతగా పనిచేసేవారికి అభినందనలు



తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర (ఫైల్)

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి విషయంలో జిల్లా పోలీస్ బాస్ నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదుదారులను నిర్లక్ష్యం చేసినా, వారికి సరైన గౌరవం ఇవ్వకపోయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. మూడు వారాల్లో నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. మరోవైపు బాధ్యతగా పనిచేసేవారిని అభినందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

జిల్లా ఎస్పీగా రాజేశ్ చంద్ర బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి పోలీస్ స్టేషన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ రికార్డులను పరిశీలిస్తున్నారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోతే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రికార్డుల నిర్వహణతో పాటు స్టేషన్ పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచాలని సూచిస్తున్నారు. పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బంది ప్రవర్తనను సైతం గమనిస్తున్నారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టు, రిమాండు రిపోర్టులను చూసి కొన్నిచోట్ల అక్కడి అధికారులు, సిబ్బందికి వార్నింగ్‌లు కూడా ఇచ్చారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అలాగే స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ నిర్వహించే కానిస్టేబుళ్ల నుంచి మొదలుకుని అన్ని విభాగాల సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. బాగా పనిచేసేవారిని అభినందిస్తూ, నిర్లక్ష్యం చేసేవారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశిస్తున్నారు. కాగా ఎస్పీ ఎప్పుడు ఏ ఠాణాను తనిఖీ చేస్తారోనన్న భయం జిల్లాలోని పోలీసు అధికారులను పట్టుకుంది. దీంతో గతంలో పట్టణాల్లో నివాసం ఉంటూ ఠాణాలకు రాకపోకలు సాగించిన కొందరు అధికారులు స్థానికంగా ఉండే ప్రయత్నం చేస్తున్నారు.

### శాఖాపరమైన చర్యలు..

విధుల్లో నిర్లక్ష్యం, బాధితులు, ఫిర్యాదుదారులు, నిందితుల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న వారిపై ఎస్పీ చర్యలకు ఉపక్రమించారు. మూడు వారాల కాలంలో జిల్లాలో ఓ ఎస్సై, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డులపై చర్యలు తీసుకున్నారు. గత నెల 26న బాన్సువాడలో దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్ కిరణ్, హోంగార్డు గంగాధర్‌ను ఎస్పీ సస్పెండ్ చేశారు. తాగి న్యూసెన్స్ చేసిన వ్యక్తి విషయంలో వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన కానిస్టేబుల్, హోంగార్డు దురుసుగా ప్రవర్తించడాన్ని సీరియస్‌గా పరిగణించారు. వారిద్దరిని సస్పెండ్ చేశారు. జుక్కల్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ అంబర్‌సింగ్ పోలీసు స్టేషన్‌కు వచ్చిన బాధితులు, నేరస్తులతో చనువుగా ఉంటూ వాకి అనుకూలంగా వ్యవహరిస్తానని డబ్బులు డిమాండ్ చేస్తున్న విషయం ఎస్పీ దృష్టికి రాగా.. ఆయనపై చర్యలకు ఉపక్రమించారు. తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు విధులకు గైర్హాజరవుతూ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇలా వరుసగా చర్యలు తీసుకుంటుండడంతో పోలీసు అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైంది.

### సేవలకు ప్రశంసలు..

బాధ్యతగా పనిచేస్తూ, ఆపదలో ఉన్న వారిని కాపాడిన సిబ్బందిని అభినందిస్తున్నారు. ఆదివారం పిట్లం మండల కేంద్రంలో సునీత అనే మహిళ కుటుంబ కలహాలతో చెరువులో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా గమనించిన స్థానికులు డయల్ 100 కు కాల్ చేశారు. దీంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది రవిచంద్ర, మారుతి అక్కడికి చేరుకుని చెరువులో దూకి బాధితురాలిని కాపాడారు. ఆమెను ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిద్దరిని అభినందించారు. ఇటీవల బీర్కూర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కనిపించకుండాపోగా పోలీసులు వారిని 18 గంటల వ్యవధిలో గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా బీర్కూర్ పోలీసులను ఎస్పీ ప్రశంసించారు. కామారెడ్డి పట్టణంలో శిశువును అమ్మిన విషయంలో చురుకుగా వ్యవహరించిన ఏఎస్సై రమారావ్, కానిస్టేబుల్ వెంకటేశ్, హోంగార్డ్ బాలరాజ్, ఏఆర్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌లను ఎస్పీ అభినందించారు.

# ఎస్ఆర్ఎన్‌కే @ 25 ఏళ్లు



బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల

- ఈ నెల 24న సిల్వర్ జూబ్లీ నిర్వహణకు ఏర్పాట్లు
- పూర్వ విద్యార్థులకు ఆహ్వానం

బాన్సువాడ : రెండున్నర దశాబ్దాల క్రితం వెలసిన ఈ చదువులమ్మ గుడి.. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థితికి చేర్చింది. తన నీడన చేరిన వారికి జ్ఞానాన్ని అందిస్తూ విద్యావృక్షంగా ఎదిగిందీ డిగ్రీ కళాశాల. బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే (శ్రీరాం నారాయణ్ ఖేడియా) డిగ్రీ కళాశాల ఏర్పాటై 25 ఏళ్లవుతోంది. ఈ సందర్భంగా ఈనెల 24న రజతోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

**అందుబాటులో ఉన్న గ్రూపులు...**
ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ (ఎంపీసీ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, ఎంజెడ్‌సీఎస్, పీజీ తెలుగు, పీజీ ఇంగ్లిష్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 52 తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్నాయి. కళాశాలకు 2022–23 సంవత్సరంలో బీ+ న్యాక్ గుర్తింపు లభించింది. 2024–2025లో అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా లభించింది. ప్రస్తుతం 1,338 మంది విద్యార్థులు చదువుతున్నారు.

### పూర్వ విద్యార్థులను సన్మానిస్తాం



ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రారంభమై 25 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 24న సిల్వర్ జూబ్లీ వేడుకలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పూర్వ విద్యార్థులందరినీ ఆహ్వానిస్తున్నాం. వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను సన్మానిస్తాం.

– వేణుగోపాల్ స్వామి, ప్రిన్సిపల్, ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల

### అంకురార్పణ ఇలా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాన్సువాడకు డిగ్రీ కళాశాల మంజూరు కాగా దేశాయిపేట్ సమీపంలోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని భావించారు. యజమాని, పారిశ్రామికవేత్త శ్రీరాం నారాయణ్ ఖేడియాను సంప్రదించగా స్థలాన్ని ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించారు. కానీ కళాశాలకు తన పేరు పెట్టాలని కోరడంతో అప్పటి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేసి ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలగా నామకరణం చేశారు. దీంతో బాన్సువాడకు రెండు కిలోమీటర్ల దూరంలో 11.16 ఎకరాల స్థలంలో 25 ఏళ్ల క్రితం అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు కళాశాలను ప్రారంభించారు. 25 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ కళాశాలలో చదివిన వారు ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారు. కళాశాల ఏర్పాటై 25 ఏళ్లవుతున్న సందర్భంగా రజతోత్సవాలు నిర్వహిస్తున్నారు.

# నేటి నుంచి రైతు మహోత్సవం



గిరిరాజ్ కళాశాల వద్ద స్టాళ్లకోసం ఏర్పాట్లు

- ప్రారంభించనున్న మంత్రులు తుమ్మల, ఉత్తమ్, జూపల్లి
- మూడు రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం
- వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాళ్ల ప్రదర్శన
- గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో సోమవారం నుంచి బుధవారం వరకు రైతు మహోత్సవం నిర్వహించనున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ఉదయం 11.00 గంటలకు ప్రారంభించనున్నారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమం పురస్కార గ్రహీతలైన అభ్యుదయ రైతులతోపాటు రైతు ఉత్పాదక సంస్థలు తమ అనుభవాలు పంచుకునేందుకు వేదిక కానుంది. వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచనున్నారు. ఇందుకోసం సుమారు 150 స్టాల్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తలు, పశు సంవర్ధక, మత్స్యశాఖ నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు నూతన వ్యవసాయ పద్ధతులపై మూడు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తారని, అందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

# వివాహ వేడుకలో ఉమ్మడి జిల్లా నేతలు



వధూవరులతో ప్రశాంత్‌రెడ్డి, బీబీ పాటిల్, సురేందర్, హన్మంత్ సింధే, ముజీబొద్దీన్ తదితరులు

నిజాంసాగర్: జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్‌లో ఆదివారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ శోభరాజు దంపతుల పెద్ద కూతురు కీర్తన వివాహం జరిగింది. వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాల్‌రాజ్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే, రవీందర్‌రెడ్డి, సౌదాగర్ గంగారాం, జనార్దన్ గౌడ్, అరుణతార, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# దక్కని 'భరోసా'!



- మార్చి 31 నాటికి పెట్టుబడి సాయం పూర్తి చేస్తామన్న సర్కారు
- ఇప్పటివరకు మూడున్నర ఎకరాల లోపు రైతులకే లబ్ధి
- జిల్లాకు ఇంకా రావాల్సింది రూ.100 కోట్లపైనే..
- నిరాశలో రైతు భరోసా అందని రైతులు

కామారెడ్డి క్రైం: రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న సర్కారు.. రైతులకు సంబంధించిన పథకాలను మాత్రం సక్రమంగా అమలు చేయడంలో విఫలమవుతోంది. ఓవైపు పంట రుణాలు మాఫీ కాక.. మరోవైపు రైతు భరోసా అందక వేలాది మంది రైతులు నిరీక్షిస్తున్నారు. దీంతో రైతులకు సంబంధించిన పథకాల అమలులో సర్కారుకు చిత్తశుద్ధి లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు పంటల పెట్టుబడి విషయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని తీసుకువచ్చింది. ఏటా రెండు పంటలకు కలిపి ఎకరానికి రూ. 10 వేలచొప్పున పెట్టుబడి సాయం అందించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చాక రైతుబంధులో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొంటూ సాగుకు యోగ్యం కాని భూములకు పథకాన్ని నిలిపివేసి నిధుల వృథాను అరికట్టడానికి ఓ కమిటీ వేశారు. ఆ కమిటీ సాగుకు యోగ్యం కాని భూముల లెక్కలు తీసింది. నిధుల కొరత కారణంగా ఎకరానికి రూ.6 వేలు మాత్రమే రైతు భరోసా జమ చేస్తామని ప్రకటించింది. ఈ ఏడాది జనవరి 26 న యాసంగి సీజన్‌కు సంబంధించిన నిధుల విడుదలను ప్రారంభించింది. మార్చి 31 వరకల్లా వంద శాతం పెట్టుబడి సాయం అందిస్తామని పేర్కొంది.

జిల్లాకు సంబంధించి రైతు భరోసా అందించేందుకు 3,25,713 రైతులకుగాను రూ.315.31 కోట్ల నిధులు అవసరం. ఇప్పటి వరకు జిల్లాలోని 2,70,149 మంది రైతులకుగాను రూ. 215.98 కోట్లు మాత్రమే అందాయి. ఇంకా 55 వేల మంది రైతులకు గాను మరో రూ. వంద కోట్ల వరకు నిధులు రావాల్సి ఉంది. మూడున్నర ఎకరాలలోపు రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందినట్లు తెలుస్తోంది. మిగతా రైతులు రైతు భరోసా కోసం నిరీక్షిస్తున్నారు. మరోవైపు యాసంగి సీజన్ ముగింపునకు వచ్చింది. త్వరలోనే ఖరీఫ్ పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికీ యాసంగికి సంబంధించిన పెట్టుబడి సాయమే అందకపోవడంతో వేలాది మంది రైతులు నిరాశ చెందుతున్నారు.

### వడ్డీ వ్యాపారులే దిక్కు..

మార్కెట్‌లో నగదు చెలామణి గతంలో మాదిరిగా లేదు. అప్పు పుట్టడం కష్టంగా ఉందని రైతులు అంటున్నారు. ఇలాంటి తరుణంలో పంటల పెట్టుబడికి రైతు భరోసా ఉపయోగకరంగా ఉంటుందని, కానీ అందరికీ భరోసా నిధులు జమ కాకపోవడంతో ఈసారి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ గడుస్తున్నా యాసంగి సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయమే పూర్తిగా అందకపోవడంతో వచ్చే సీజన్‌లో రైతుభరోసా ఉంటుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు త్వరగా రైతు భరోసా పూర్తి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

### అందరికీ అందేలా చూస్తాం..



జిల్లాలో అర్హులైన 3.15 లక్షల మంది రైతుల వివరాలను అప్‌డేట్ చేసి ప్రభుత్వానికి పంపాం. వారిలో ఇప్పటివరకు 2.70 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా నిధులు జమ చేస్తాం.

– తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

### మడిలో ఆహార వేట

యాసంగి పనులు పూర్తి కావడంతో రైతులు వానాకాలం సీజన్ కోసం సన్నద్ధమవుతున్నారు. భూములను దున్ని నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆహారాన్వేషణలో ఉన్న కొంగలు.. మట్టిలోని పురుగులను తినడానికి మడిపై వాలాయి. మరోవైపు మడి నిండా తెల్లకలువల్లా ఉన్న కొంగలను తరిమేందుకు గ్రామసింహం తంటాలు పడింది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– నస్రుల్లాబాద్



నారు మడిలో ఉన్న కొంగల గుంపు

## క్లుప్తంగా

### దాది రతన్ మోహిని సేవలు ప్రశంసనీయం



రతన్ మోహిని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బ్రహ్మకుమారీలు

**కామారెడ్డి అర్బన్:** బ్రహ్మకుమారి చీఫ్ అడ్మిన్స్ట్రేటర్ దాది రతన్ మోహిని సేవలు ప్రశంసనీయమని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి జయ దీదీ అన్నారు. ఆదివారం కామారెడ్డి ఓంశాంతి కేంద్రంలో రతన్ మోహిని దాది చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు గంగలత, కవిత, లలిత, చంద్రకళ, అనిల్‌కుమార్, జిల్లాలోని ఆయా గ్రామాల ఓంశాంతి కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### నేలకూలిన చెట్లు



అడ్డంగా పడి ఉన్న చెట్లు

**బీబీపేట:** గత రెండు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులు, వడగళ్ల వర్షాలకు నేలకూలిన చెట్లను అధికారులు నామమాత్రంగా తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. బీబీపేట నుండి తుజాల్‌పూర్ ప్రధాన రహదారిలో సుమారుగా ఆరు చెట్లు నేలకూలగా అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. రోడ్లపై సగం వరకు అలాగే చెట్లు ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

### కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాల గోల్‌మాల్

**నస్రుల్లాబాద్:** మండలంలోని అంకోల్ గ్రామంలో ఐకేపీ వారు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు గోల్‌మాల్ జరిగినట్లు బాధిత రైతు వాపోతున్నారు. ఈ నెల 16న అంకోల్ గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి అనే రైతు ఐకేపీ అధికారులకు 281 సంచులను తూకం చేసి ఇచ్చాడు. ప్రస్తుతం 240 సంచులు మాత్రమే తనయంటు అధికారులు తెలుపుతున్నారని, 40 సంచుల వరకు తేడా వచ్చిందని తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు. ఈ విషయమై ఏపీఎం గంగాధర్‌ను వివరణ కోరగా గ్రామంలో పూర్తి విచారణ చేపట్టి ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుంటామని అన్నారు.

# మున్సిపాలిటీ పేరుతో పన్ను వసూలు

- జీపీలకు పెరిగిన పన్ను ఆదాయం
- బిచ్కుంద మున్సిపాలిటీలో మూడు గ్రామాలు విలీనం
- నాలుగైదు రెట్లు పన్ను పెరుగుతుందని ప్రచారం



మున్సిపాలిటీగా మారనున్న బిచ్కుంద గ్రామ పంచాయతీ

**బిచ్కుంద(జుక్కల్):** బిచ్కుంద మున్సిపాలిటీగా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో గోపన్‌పల్లి, దౌల్తాపూర్, కందర్‌పల్లి గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఇదే అదునుగా భావించిన పంచాయతీ అధికారులు పన్ను వసూళ్ల పై ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపాలిటీ అయితే నాలుగైదు రెట్లు అన్ని రకాల పన్నులు పెరిగిపోతాయి. ఇప్పుడు పన్ను కడితే తక్కువ ఖర్చులో చెల్లించవచ్చని జోరుగా ప్రచారం చేస్తున్నారు. అధికారుల పనితీరు చెట్టు పేరుచెప్పి కాయలు అమ్ముకున్నట్లుగా ఉంది. మున్సిపాలిటీ భయంతో ప్రజలు ఇంటి, కుళాయి,వాణిజ్య సముదాయాలు, ట్రేడ్ లైసెన్సులు, ప్లాట్ల నాలా కన్వర్షన్ వివిధ రకాల పన్నులు కట్టడానికి ప్రజలు ముందుకు వస్తున్నారు. దీంతో జీపీలకు పన్ను ఆదాయం పెరుగుతోంది.

**గతంలో నిలదీశారు...**

ఇంటింటికి వెళ్లి పన్ను కట్టాలని సిబ్బంది అడిగితే తాగునీరు రావడం లేదని, మురికి కాలువలు శుభ్రం చేయడంలేదని, రోడ్డు పై చెత్త అలాగే ఉందని, వీధిలైట్లు వెలగడం లేదని ప్రజలు నిలదీసేవారు. ఇప్పుడు ఏకంగా ప్రజలే జీపీ వెళ్లి పన్ను చెల్లిస్తున్నారు. బిచ్కుంద గ్రామ పంచాయతీకి 97 శాతం రూ.30 లక్షల పైన పన్ను వసూలైంది. దౌల్తాపూర్‌లో 98 శాతం, కందర్‌పల్లిలో 95 శాతం, గోపన్‌పల్లిలో 90 శాతం పన్ను వసూలైందని అధికారులు తెలిపారు. ఏమైనా మున్సిపాలిటీ పేరుతో పన్ను ఆదాయం రెట్టింపు పెరిగింది.



బిచ్కుందలో పన్ను రసీదు అందిస్తున్న సిబ్బంది



బిచ్కుంద కందర్‌పల్లి రోడ్డులో వెలిసిన వెంచర్

**గృహ నిర్మాణాల కోసం దరఖాస్తులు..**

బిచ్కుంద, గోపన్‌పల్లి, కందర్‌పల్లి, దౌల్తాపూర్ గ్రామ శివారులలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఎన్నో వెంచర్లు వెలిశాయి. భవిష్యత్తులో మున్సిపాలిటీ అధికారుల నిబంధనలు కఠినంగా ఉంటాయని భావించి, ఓపెన్ ప్లాట్లు ఉన్న వారు గృహ నిర్మాణాల అనుమతి కోసం జీపీలలో దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. మున్సిపాలిటీ గెజిట్ రాకముందే నిర్మాణాల అనుమతులు పొందాలని జీపీల చుట్టూ తిరుగుతున్నారు. జీపీ అధికారులు ఎలాంటి షరతులు లేకుండా అనుమతులు ఇవ్వాలని కొందరు రాజకీయ నాయకులతో సిఫార్సు చేయిస్తున్నారు. మరికొందరు అధికారులకు అడిగినకాడికి ముట్టు జెప్పుతున్నారని విమర్శలున్నాయి.

# భవిష్యత్తుకు విద్యార్థి దశ కీలకం



వేదికపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

**భిక్కనూరు:** భవిష్యత్తుకు విద్యార్థి దశ పునాది లాంటిదని సాంఘిక సంక్షేమ గురుకులాల రిటైర్డ్ రీజినల్ కో–ఆర్డినేటర్ తులసీదాస్ అన్నారు. ఆదివారం భిక్కనూరు గురుకుల కళాశాలలో నిర్వహించిన 2007–08 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. 18 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న విద్యార్థులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మాజీ ప్రిన్సిపాల్ జనార్దన్, టీచర్లు గులాం యస్‌దాని, నర్సింగ్‌రావు, నగేశ్, అమర్నాద్, రమేశ్, రాంచంద్ర బాబు, సురేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

**నిజామాబాద్ అర్బన్:** ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు ఆదివారం తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి పరీక్షలకు మొత్తం 925 విద్యార్థులకు 834 మంది హాజరుకాగా, 91 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో మొత్తం 1,782 మందికిగాను 1,612 మంది హాజరుకాగా, 170 మంది గైర్హాజరయ్యారు.

### శిథిలావస్థకు నస్రుల్లాబాద్ జీపీ భవనం



శిథిలావస్థలో నస్రుల్లాబాద్ గ్రామ పంచాయతీ భవనం

**నస్రుల్లాబాద్(బాన్సువాడ):** మండలకేంద్రంలో గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. కాగా ఈభవనం నిర్మించి యాభై ఏళ్లు పూర్తయింది. గతంలో జీపీ భవనం నిర్మాణం కోసం నిధులు కేటాయించినా అధికారుల అలస్వతం కారణంగా నిధులు వెనక్కి వెళ్లిపోయాయని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన జీపీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చిన్నారులను బలిగొన్న లారీ

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- ఒకరికి తీవ్రగాయాలు



భానుప్రసాద్(ఫైల్)



ఓంకార్



తీవ్రగాయాలైన విశ్వనాథ్

**ఆర్మూర్‌టౌన్:** వివాహానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ఇద్దరు చిన్నారులను లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ వద్ద 44వ నంబరు జాతీయ రహదారి బైపాస్ మార్గంపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓంకార్(14), భానుప్రసాద్(11) అనే ఇద్దరు బాలురు దుర్మరణం చెందగా విశ్వనాథ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్మూర్ పట్టణానికి చెందిన బంజ విశ్వనాథ్, లక్ష్మి దంపతుల కుమారుడు ఓంకార్ జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వసతిగృహంలో 8వ తరగతి చదువుతున్నాడు. సెలవుల్లో ఇంటికి వచ్చిన ఓంకార్ ఇంటి పక్కనే ఉండే స్నేహితుడు భానుప్రసాద్‌తో కలిసి ఉదయం వరకు ఆడుకున్నారు. కాగా, విశ్వనాథ్ పెర్కిట్‌లో జరుగుతున్న ఓ వివాహానికి హాజరయ్యేందుకు ఓంకార్, భానుప్రసాద్‌ను తీసుకొని బైక్‌పై బయలుదేరాడు. పెర్కిట్ జాతీయ రహదారి బైపాస్ మార్గం వద్ద రోడ్డు దాటుతుండగా నిర్మల్ వైపు నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. భానుప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ తండ్రీకొడుకులు విశ్వనాథ్, ఓంకార్‌ను పోలీసులు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స అందిస్తుండగానే పరిస్థితి విషమించి ఓంకార్ మరణించాడు. విశ్వనాథ్‌ను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్న ఇరుకుటుంబాల వారు తమ పిల్లలు ఇక లేరని తెలుసుకొని గుండెలవిసేలా విలపించారు. ప్రమాదానికి కారణమైన లారీతోపాటు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

### ఫైనాన్స్ కంపెనీ వేధింపులు

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**కామారెడ్డి క్రైం:** ఓ వైపు కేసులు నమోదవుతున్నా ఫైనాన్స్ కంపెనీల ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా ఓ ఫైనాన్స్ కంపెనీ వేధింపులు భరించలేక బాధితులు పోలీసులను ఆశ్రయించిన ఘటన టేక్రియాల్‌లో వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టేక్రియాల్‌కు చెందిన మద్దికుంట పోచయ్య, స్వామి అన్నదమ్ములు. కుటుంబ అవసరాలకోసం వారిద్దరు కలిసి రెండేళ్ల క్రితం ఓ ఫైనాన్స్ కంపెనీలో ఇంటిపై రూ.3 లక్షలు రుణం తీసుకున్నారు. ప్రతినెలా వాయిదాలు సక్రమంగానే చెల్లించారు. డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో రెండు నెలలుగా ఈఎంఐ కట్టలేదు. శనివారం సాయంత్రం ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు గ్రామానికి వచ్చి పోచయ్య, స్వామిలతో వాగ్వాదానికి దిగారు. గ్రామంలో చాటింపు వేయిస్తామని, ఇంటికి తాళం వేస్తామని, ఇంటిని వేలం వేస్తామని బెదిరిస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడారని బాధితులు ఆరోపిస్తూ దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# పెళ్లి వేడుకలో అర్ధరాత్రి హిజ్రాల డ్యాన్స్

- పోలీసులకు స్థానికుల ఫిర్యాదు
- తొమ్మిది మందిపై కేసు

**ఖలీల్‌వాడి:** నిజామాబాద్ నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల ఓ వివాహ వేడుకలో హిజ్రాలు అర్ధరాత్రి దాటాక అశ్లీలంగా డ్యాన్స్ చేయడం వివాదాస్పదమైంది. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో నగర్‌లో శనివారం ఓ వివాహ వేడుక జరిగింది. అర్ధరాత్రి సమయంలో హిజ్రాలు వచ్చి అశ్లీలంగా నృత్యం చేయడం ప్రారంభించారు. మరోవైపు డీజే సౌండ్ మోతతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. తెల్లవారు జాము 3 గంటలవుతున్నా డీజే ఆపకపోవడంతో స్థానికులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వచ్చి మాట్లాడగా.. పెళ్లిలో డ్యాన్స్ చేస్తున్నామని హిజ్రాలు సమాధానమిచ్చారు. తెల్లవారుజాము 3 గంటల వరకు డీజే పెడితే స్థానికులు ఇబ్బంది పడతారని పోలీసులు చెప్పారు. ఇంతలోనే నగరానికి చెందిన పలువురు రౌడీ షీటర్లు అక్కడికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు అతికష్టంమీద హిజ్రాలను స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ సౌత్ సీఐ సురేశ్ ఆరో టౌన్‌కు వెళ్లి వివరాలను సేకరించినట్లు తెలిసింది.

## క్రైం కార్నర్

# ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి



చిన్న (ఫైల్)

**రాజంపేట:** ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైరు కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన రాజంపేట మండలం గుడితండా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాలోత్ అనిత గణేశ్‌లకు ముగ్గురు పిల్లలు. చిన్న కుమారుడైన మాలోత్ చిన్న(3) శనివారం సాయంత్రం ఇంటి వద్ద పార్క్ చేసి ఉన్న ట్రాక్టర్‌పై కూర్చుని ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో బాలుడు ట్రాక్టర్ గేర్‌ను న్యూట్రల్ మార్చడంతో కదిలింది. ట్రాక్టర్ ట్రాలీతోపాటు రివర్స్‌లో వెనక్కి వెళ్తుండడంతో భయాందోళనకు గురైన బాలుడు ట్రాక్టర్‌పై నుంచి కింది దూకే ప్రయత్నంలో టైర్ కిందపడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే బాలుడిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

**నీట మునిగి వృద్ధురాలు..**

**మాచారెడ్డి:** పాల్వంచ మండలం ఇసాయిపేటలో కోలాపురం లక్ష్మి(62) అనే వృద్ధురాలు ఆదివారం నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలు శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం చెరువులో శవమై తేలింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

**చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి ..**

**మాక్లూర్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లిలో ఓ వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. మూడు రోజుల క్రితం అతను అనారోగ్యానికి గురికావడంతో గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

# చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



**బాన్సువాడ:** బీర్కూర్ మండలం బైరాపూర్ ఊర చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని బీర్కూర్ ఎస్సై రాజశేఖర్ ఆదివారం తెలిపారు. చెరువులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని జాలర్లతో మృతదేహాన్ని బయటకి తీయించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు షర్టు, కాఫీ కలర్ ప్యాంటు ఉందని, అతని వయస్సు సుమారు 40 ఏళ్ల వరకు ఉంటాడని అన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712686173 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

# ఇందల్వాయిలో ఆరు ఇళ్లలో చోరీ

**ఇందల్వాయి:** ఇందల్వాయి గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఆరు ఇళ్లల్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని స్కూల్ కాలనీలో బుట్టి మంజుల, బేతాల భూమయ్య, ఫర్హనా బేగం, కట్టెల బాలయ్య తదితరులు వేసవికాలం కావడంతో రాత్రిపూట దాబాలపై నిద్రిస్తున్న సమయంలో దుండగులు ఇళ్లలోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. వారి బీరువాల్లో ఉన్న ఏడు తులాల బంగారం, 36 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదును దొంగిలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

**బాన్సువాడలో..**

**బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సంగమేశ్వర కాలనీలో నివాసముంటున్న చెనంగారి సాయవ్వ, ఆమె కుమార్తె రాణి రాత్రి రెండు గదులకు తాళం వేసి ఇంటి దాబాపై పడుకున్నారు.దుండగులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో 12 తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి, రూ. 21 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. చెనంగారి అంజయ్య, సురేశ్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

**సదాశివనగర్‌లో..**

**సదాశివనగర్:** మండల కేంద్రంలో ఆదివారం దుండగులు చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రానికి చెందిన రెడ్డిపేట్ రాజయ్య ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 4 గ్రాముల బంగారు కమ్మలు, 30 గ్రాముల పట్టగొలుసులు, రూ. 15వేల నగదు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

### ఫ్రూట్ సలాడ్ కోసం వెళ్తే రూ. లక్ష మాయం

**బాన్సువాడ :** ఫ్రూట్ సలాడ్ తాగేందుకు వచ్చిన ఓ వ్యక్తి రూ. లక్ష నగదును పోగొట్టుకున్న ఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన సాయిలు అనే వ్యక్తి శనివారం బాన్సువాడలోని ఓ బ్యాంకులో రూ. లక్ష నగదును డ్రా చేసుకుని ఫ్రూట్ సలాడ్ తాగేందుకు కూల్‌డ్రింక్ దుకాణానికి వెళ్లాడు. ఫ్రూట్ సలాడ్ తాగుతున్న సమయంలో చేతిలో ఉన్న నగదు కవరును టేబుల్‌పై పెట్టి సలాడ్ తాగి కవర్‌ను అక్కడే మరిచి వెళ్లిపోయాడు. పది నిమిషాల తర్వాత అక్కడికి రాగా నగదు ఉన్న కవర్ కనిపించలేదు. అక్కడున్న సీసీ కెమెరాను పరిశీలించగా ఓ యువకుడు కవరును తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. వెంటనే సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### యువకుడిపై కేసు నమోదు

**రుద్రూర్:** మండలంలోని బొప్పాపూర్‌లో మూడు గడ్డివాములు దగ్ధమైన ఘటనలో నందిగామ ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాయన్న తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున సంగోళ్ల వినోద్, పట్ల సాయిలు, నరోజి లచ్చయ్య గడ్డివాములకు నిప్పంటించి ప్రవీణ్ పారి పోయినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

### అనుమతులు లేకుండా టేకు చెట్ల నరికివేత



**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో అనుమతులు లేకుండా టేకు చెట్లను నరికి వేసిన ఘటనపై కామారెడ్డి అటవీశాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. హాస్టల్‌లో అనుమతులు లేకుండా టేకు చెట్లను నరికి వేశారన్న సమాచారం మేరకు కామారెడ్డి అటవీశాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ డీఆర్‌వో అనురంజని, సెక్షన్ ఆఫీసర్ గోపాల్ పరిశీలించారు. నాలుగు చెట్లను నరికి టేకు దుంగలను ఒగదిలో ఉంచిన దానిని పరిశీలించడంతో పాటు, నరికి వేసిన టేకు చెట్ల కొలతలను తీసుకున్నారు. నరికిన టేకు దుంగల విలువ సుమారు రూ. 30 వేల వరకు ఉంటుందన్నారు. టేకు దుంగలను సీజ్ చేసి ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని డీఆర్‌వో తెలిపారు.

### భూమి కోసం మరదలి హత్య

**ఎడపల్లి:** ఇరవై గుంటల భూమి కోసం సొంత వదిన మరదలిని హత్య చేయించిన ఘటన ఎడపల్లి మండలం జైతాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారులు యాదగిరి, నాగులు కాగా కుమార్తె పురిమేటి లక్ష్మి(50) వికలాంగురాలు. గతంలో కుటుంబ సభ్యుల సమక్షంలో లక్ష్మికి తల్లిదండ్రులు 20 గుంటల భూమిని కేటాయించారు. ఈ భూమిని లక్ష్మి చిన్న అన్న నాగులు కౌలుకు సాగు చేస్తున్నాడు. తల్లిదండ్రులు కేటాయించిన 20 గుంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని అన్న నాగులు, పెద్ద వదిన అనసూయను లక్ష్మి కోరింది. ఇందు కోసం రూ. 26 వేల నగదును లక్ష్మి సిద్ధం చేసుకుంది. మరదలికి భూమిని రిజిస్ట్రేషన్ చేయించడం ఇష్టం లేని వదిన అనసూయ ఆమె వద్ద ఉన్న రూ. 26 వేల నగదును సైతం కాజేసి హత్య చేయాలని పథకం రచించింది. దీని కోసం గ్రామానికి చెందిన చెన్నంగుల రాకేశ్ సహాయం తీసుకుంది.

వీరిద్దరు లక్ష్మిని ఈ నెల 13న గ్రామ శివారులోని డంపింగ్ యార్డు సమీపంలోకి తీసుకెళ్లి గొడవ పడి హత్య చేశారు. చెల్లెలి మృతిపై అనుమానం ఉందంటు చిన్న అన్న నాగులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ముందుగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా అందులో హత్య అని తేలింది. విచారణలో అనసూయ, రాకేశ్ హత్య చేసినట్లు తేలడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

కాపాడిన బ్లూ కోల్ట్స్ సిబ్బంది

**పిట్లం:** కుటుంబ కలహాలతో ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా బ్లూ కోల్ట్స్ పోలీసులు ఆమెను రక్షించిన ఘటన పిట్లం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం గ్రామానికి చెందిన గుణిజి సునీత కుటుంబ కలహాలతో గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. విషయం తెలుసుకున్న పిట్లం పీఎస్ బ్లూ కోర్ట్ సిబ్బంది జి రవిచంద్ర కానిస్టేబుల్, హోంగార్డు మారుతి ఘటన స్థలానికి చేరుకొని చెరువు మధ్య వరకు వెళ్లిన ఆమెను బయటకు తీసుకొచ్చారు. సిబ్బంది చేసిన సాహసాన్ని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

# అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

సీపీ పోతరాజు సాయిచైతన్య

**ఖలీల్‌వాడి:** అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీ పోతరాజు సాయిచైతన్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి సీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యక్రమానికి హాజరైన పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన స్థానిక ప్రజలు మంటలను ఆర్పివేస్తే ఆస్తి, ప్రాణ నష్టం తక్కువగా ఉంటుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్లు పి.నర్సింగ్ రావు, మధుసూదన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

### విజేతలకు సీపీ సన్మానం



**నిజామాబాద్ అర్బన్:** అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా నగర అగ్నిమాపక శాఖ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో కాకతీయ ఒలంపియాడ్ విద్యార్థులు ఆయా విభాగాలలో విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీలలో పాఠశాలకు చెందిన లక్ష్మీమేఘన(9వ తరగతి), డ్రాయింగ్ పోటీలలో వైభవి(7వతరగతి) విజేతలుగా నిలిచారు. ఆదివారం పోలీసు కమిషనర్ సాయిచైతన్య.. మెమొంటోలతో విద్యార్థులను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ రామోజీరావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు కో–కరికులర్ యాక్టివిటీస్ మీద కూడా శ్రద్ధ పెంచుకొని ఇలాంటి మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ దిగంబర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బొప్పాపూర్‌లో పోలీసులకు చేదు అనుభవం



పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

**రుద్రూర్:** మండలంలోని బొప్పాపూర్‌లో మహిళ మృతి విచారణకు వెళ్లిన పోలీసులకు చేదు అనుభవం ఎదురైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంగవ్వ(50) ఆదివారం ఉదయం మృతి చెందింది. మహిళది సహజ మరణం కాదంటు మండల కేంద్రంలో పుకార్లు వ్యాపించాయి. ఈ విషయమై విచారణ నిమిత్తం ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో బొప్పాపూర్ గ్రామానికి పోలీసులు మధ్యాహ్నం వెళ్లారు. అప్పటికే శవయాత్ర కొనసాగుతోంది. శవయాత్రను అడ్డుకున్న పోలీసులతో మృతురాలి బంధువులు వాగ్వాదానికి దిగారు. దింపుడు కళ్లెం దాటిన తర్వాత ఆపితే గ్రామానికి అరిష్టం వస్తుందని స్థానికులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టుమార్టంకు అంగీకరించేది లేదంటూ శ్మశాన వాటికలో దహనం చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళ సహజంగానే మరణిస్తే పోలీసులతో ఎందుకు వాగ్వాదానికి దిగారు. పోస్టుమార్టం చేయడానికి అంగీకరించక పోవడం అనుమానానికి తావిస్తోంది. పోలీసులు మహిళ ఎలా మృతి చెందిందనే విషయమై గ్రామంలో విచారణ చేపడుతున్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**రాజంపేట:** మండలంలోని గుండారం అటవీ ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని రాజంపేట పీఎస్‌కు తరలించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేశ్ తెలిపారు. ఆదివారం గుండారం అటవీ ప్రాంతంలో సంతాయిపేట గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అటవీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్‌వో రమేశ్ హెచ్చరించారు. కార్యక్రమంలో కొండాపూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీధర్ రావు, ఆర్గొండ సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ బాబా, బీట్ అధికారులు శ్రీను, స్రవంతి పాల్గొన్నారు.